సాక్షి
అనకాపల్లి
గురువారం । 5 । అక్టోబర్ । 2023



సమస్యల సత్వర పరిష్కారం

మాడుగులలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 223 అర్జీలు అందాయి.

8లో



అప్పన్న సన్నిధిలో..

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు.



సీఐఐ బృందం హార్బర్ పర్యటన

విశాఖ: న్యూఢిల్లీ నుంచి వచ్చిన సీఐఐ బృందం బుధవారం ఫిషింగ్ హార్బర్‌లో పర్యటించి. అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించింది.

న్యూస్‌రీల్

కందిపప్పు గింజలతో వరల్డ్ కప్ నమూనా



మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ ప్రపంచకప్ క్రికెట్ పోటీల నేపథ్యంలో కందిపప్పు గింజలతో వరల్డ్ కప్ నమూనా తయారు చేశారు. గురువారం నుంచి ప్రపంచ కప్ క్రికెట్ పోటీలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రవి కుమార్ 356 కందిపప్పు గింజలతో వరల్డ్ కప్ నమూనాను తయారు చేశారు. క్రికెటర్లకు ఈ నమూనాతో ఆల్ ద బెస్ట్ తెలియజేశారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో అత్యవసరంగా నిలిపివేసిన రెండో యూనిట్‌లో బుధవారం రాత్రి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ నుంచి సరఫరా జరుగుతున్న విద్యుత్‌కు తగినంత డిమాండ్ లేని కారణంగా ఈ నెల 1న మధ్యాహ్నం రిజర్వ్ షట్‌డౌన్ చేశారు. మూడు రోజుల అనంతరం సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ రెండో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించామని, ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికార వర్గాలు వెల్లడించాయి.

హోంగార్డు కోటేశ్వరరావు సేవలు ప్రశంసనీయం



హోంగార్డు కోటేశ్వరరావుకు చెక్కు నందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: జిల్లాలోని సబ్బవరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన కె.కోటేశ్వరరావు సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం కోటేశ్వరరావు కుటుంబానికి, అనకాపల్లి జిల్లాతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పని చేస్తున్న హోంగార్డులు సేకరించిన ఒకరోజు వేతనం రూ.3,86,950 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ మరణించిన, పదవీ విరమణ చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు సహచర హోంగార్డులు స్వచ్ఛందంగా ముందుకు రావడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు(పరిపాలన) ఎస్పీ బి.విజయభాస్కర్, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలన అధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ మురళి

చోడవరం: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికైనట్టు ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు, తైక్వాండో సీనియర్ కోచ్ పల్లం మురళి బుధవారం తెలిపారు. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జాతీయస్థాయి క్యోరిగి, పూమ్‌సే తైక్వాండో పోటీలు జరుగుతున్నాయన్నారు. ఎం.హేమశ్రీ, గండి కారుణ్య సందీప్, తన్విత్ ఉదయ్, సంతోషిలక్ష్మి, శశివర్ధన్‌కుమార్, ఆర్.దీక్షిత, జి.నాగసాయిరామ్, ఎస్.వెంకటేష్, కె.సూర్య వివిధ విభాగాల్లో ఎంపికయ్యారని మురళి తెలిపారు.

వెబ్‌సైట్‌లో బ్యాక్‌లాగ్ పోస్టుల ప్రొవిజినల్ జాబితా

ఏయూక్యాంపస్: దివ్యాంగుల విభాగంలో 23 బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను https://visakhapatnam.ap.gov.in/ లో పొందుపరిచారు. 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకానికి 2022-23లో నోటిఫికేషన్ విడుదల చేయగా.. వర్క్‌షాప్ అటెండెంట్ ఉద్యోగానికి అంధ-మహిళ విభాగంలో అర్హత కలిగిన అభ్యర్థులు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి తెలిపారు.

పాడి రైతులకూ యాంత్రీకరణ అండ

- ప్రతి మండల కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్
- తొలి దశలో అనకాపల్లి, గొలుగొండ మండలాల్లో సీహెచ్‌సీలు
- రెండో దశలో 15 మండలాల్లో ఏర్పాటుకు పశుసంవర్ధకశాఖ ప్రణాళిక



తుమ్మపాలలో రైతులకు అందజేసిన గడ్డి కోసే యంత్రాలు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో పాడి రైతులకు యాంత్రీకరణను అందుబాటులోకి తెచ్చేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే సాగు చేసుకునే రైతులకు ఆర్బీకేల ద్వారా యంత్ర పనిముట్లను అద్దెకు అందజేస్తున్నారు. కొనుగోలు చేసుకునేవారికి సబ్సిడీ ఇస్తున్నారు. అదే విధంగా పాడి రైతులకు కూడా అద్దె యంత్రాలను అందజేసేందుకు దశల వారీగా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గతేడాది తొలి దశలో రూ.14.70 లక్షల ఖరీదుతో పాడి రైతులకు ఉపయోగపడేలా యంత్ర పరికరాలను అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం, గొలుగొండ మండలంలో కొత్త మల్లంపేట గ్రామాల్లో కస్టమ్ హైరింగ్ కేంద్రాలు (సీహెచ్‌సీలు) ఏర్పాటు చేశారు. వీటిలో పాడి రైతులకు ఉపయోగపడే గడ్డి కత్తిరింపు యంత్రాలు, పాలు పితికే యంత్రాలు, దాణా తయారీ యంత్రాలు, ఎండు గడ్డి బైలింగ్ మిషన్లు, ఆవుపేడతో పిడకల తయారీ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

సీహెచ్‌సీ ద్వారా ఈ యంత్రాలను పాడి రైతులకు అద్దెకు ఇస్తున్నారు. 24 గంటలపాటు ఎంత..? గంటకు ఎంత అద్దె అనేది కస్టమ్ హైరింగ్ కేంద్రాల్లో డిస్‌ప్లే చేస్తున్నారు. ఆ ప్రాంత పశుసంవర్ధకశాఖ అధికారి ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షిస్తారు. ఎవరైనా పాడి రైతులు యంత్రాలు, పరికరాలను కొనుగోలు చేసుకోవాలని భావిస్తే అందుకు తగిన వెసులుబాటు, రాయితీలు కూడా కల్పిస్తారు.



యంత్రాలను ఎలా వినియోగించాలో రైతులకు వివరిస్తున్న అధికారులు

జిల్లాలో పాడిరైతుల వివరాలు..

పశుపోషణ చేపడుతున్న కుటుంబాలు	2.34 లక్షలు
ఆవులు	1.85 లక్షలు
గేదెలు	2.5 లక్షలు
గొర్రెలు	1.61 లక్షలు
మేకలు	1.81 లక్షలు

రోజుకు అద్దె వివరాలు ఇలా...

బ్రష్ కట్టర్ (2 హెచ్‌పీ రకం)	- రూ.800
బ్రష్ కట్టర్ (1.5 హెచ్‌పీ రకం)	- రూ.400
చాఫ్ కట్టర్ (2 హెచ్‌పీ రకం)	- రూ.250
చాఫ్ కట్టర్ (1.5 హెచ్‌పీ రకం)	- రూ.200
కౌ డంగ్ (2హెచ్‌పీ రకం)	- రూ.250
మినీ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్	- రూ.300
ఎలక్ట్రికల్ పెస్ట్ (యూవీ 365)	- రూ.50
ట్రాక్టర్ పాడిస్ట్రీ బాలర్	- రూ.6,000

త్వరలో ప్రతి మండలంలో ఏర్పాటు

తొలి దశలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో రైతులు యంత్రాలను అద్దెకు తీసుకునేందుకు ఎక్కువగా మక్కువ చూపడంతో అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు పశుసంవర్ధకశాఖ సన్నాహాలు చేస్తోంది. రెండో దశలో 15 సీహెచ్‌సీ కేంద్రాలను, మూడో దశలో పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు పశుసంవర్ధకశాఖ సిద్ధమవుతోంది.

రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా..

ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్లు రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా పని చేయనున్నాయి. రైతులకు ఈ కేంద్రాలు కేంద్ర బిందువుగా ఉంటాయి గనుక హైరింగ్ సెంటర్లను కూడా అవే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. అన్ని ప్రాంతాల్లో హైరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా ఇప్పటికే వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు కృషి చేస్తున్నాయి.

తక్కువ వ్యవధిలో ఎక్కువ పనిచేసేలా...



తుమ్మపాల హైరింగ్ సెంటర్‌లో రైతునేస్తం గ్రూప్, గొలుగొండ మండలం కొత్త మల్లంపేటలో తనస్వీ పేరిట రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి సేద్యానికి వినియోగించే యంత్రాలను అద్దెకు అందిస్తున్నాం. ఇప్పటికే తక్కువ అద్దెలతో ట్రాక్టర్ల వ్యవసాయ పనిముట్లను వ్యవసాయశాఖ అందిస్తోంది. పాడి రైతులకు యాంత్రీకరణ విధానాన్ని అలవాటు చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువగా పనిచేసుకోవడానికి, సహాయకులను కూడా వీలైనంత మేరకు తగ్గించుకునేందుకు వీలుగా ఉంటుంది. పాడి రైతులు ఈ యంత్రాలను అద్దెకు తీసుకోవడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవచ్చు.

–బి.ప్రసాద్‌రావు, పశు సంవర్ధక శాఖ అధికారి

ఆహార శుద్ధి.. విస్తృత ఉపాధి



నేటివ్ అరకు కాఫీ తయారీ యూనిట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- కొడవటిపూడిలో నేటివ్ అరకు కాఫీ తయారీ యూనిట్
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం జగన్

మాడుగుల రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆహార శుద్ధి, ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, రైతులకు లాభం చేకూరుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 13 ఆహార శుద్ధి, ఇథనాల్ పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఆయన వీక్షించారు. కోటవురట్ల మండలం కొడవటిపూడి గ్రామంలో మూడున్నర ఎకరాల్లో రూ.20 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే నేటివ్ అరకు కాఫీ తయారీ యూనిట్‌కు కూడా సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ యూనిట్ ఏర్పాటుతో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రెండు వేల మంది రైతులకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అరకు కాఫీ అధికారి మనోజ్, స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ యడ్ల కళావతితో పాటు మండలంలోని గ్రామాలకు చెందిన ఉద్యానవనశాఖాధికారులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితాకు సహకరించండి

రాజకీయ పార్టీల నేతలతో జేసీ జాహ్నవి



తుమ్మపాల: తప్పులకు తావులేని ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి కోరారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఓటర్ల జాబితా తయారీపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు అందిన అభ్యర్థనలను పరిశీలించి వాటి నమోదు, తొలగింపులు దాదాపు పూర్తిచేశామన్నారు. గత వారం రోజుల్లో కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, సవరణలుపై మొత్తం 1,148 దరఖాస్తులు వచ్చాయన్నారు. మరణించిన ఓట్లను కూడా గుర్తించి తొలగించామన్నారు. సరైన డాక్యుమెంట్లు లేని ఓట్ల అభ్యర్థనలను పెండింగ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. సవరణలన్నింటినీ ఈఆర్వోలు నెట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ నెల 16 నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తుది పరిశీలన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గొర్లి సూరిబాబు, సీహెచ్ నాగేశ్వరరావు, డి.సతీష్, ఎస్‌వీవీ రామచంద్రరావు, ఆర్.శంకరరావు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆరోగ్యభాగ్యం



మాడుగుల మండలం ఎం.కోడూరులో జరిగిన ఆరోగ్య సురక్షలో కంటి బాధితులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలను వైద్యపరంగా ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఇప్పుడు లక్షలాది కుటుంబాలకు అండగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం ఎం.కోడూరు గ్రామంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలసి ఆయన ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉంటున్న నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి ఆధ్వర్యంలో పోషకాహారంపై నిర్వహించిన స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 60 మంది కంటి సమస్య ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలతోపాటు మందులు అందజేశారు. వైద్యాధికారులు సంతోష్, రేవతి, ప్రసాద్‌పాత్రుడు, లీలాప్రసాద్ 232 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు, మంత్రి ఓఎస్‌డీ ఎం.పోలినాయుడు, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేష్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 3.40 లక్షల మందికి వైద్య పరీక్షలు

సబ్బవరం: రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 3.40 లక్షల మంది వరకూ వైద్య పరీక్షలు చేయించుకున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ నిర్వహించిన శిబిరంలో 500 మంది సేవలు పొందారని చెప్పారు. గర్భిణులు, కౌమారదశ బాలికల్లో వచ్చే రక్తహీనతను నివారించడం కోసం కలెక్టర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారని ఆయన అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో లక్షా 98 వేల మంది పాల్గొని సద్వినియోగం చేసుకున్నారన్నారు. అన్ని విభాగాల నుంచి రోజుకు 11 వేల మంది వరకూ ఉన్నత వైద్యం కోసం సిఫార్స్(రిఫరల్) చేస్తున్నామన్నారు. క్యాంపుల్లో కళ్ల పరీక్షలకు విశేష స్పందన లభిస్తుందన్నారు. అవసరమైనవారికి కళ్లజోళ్లను అందించడంతో పాటు ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. డీఎంహెచ్‌వో హేమంత్, ఎంపీడీవో రమేష్ నాయుడు, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్

చోడవరంలో ధర్మ ప్రచార వారోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలు ప్రారంభిస్తున్న దేవదాయశాఖ జిల్లా అధికారి రాజారావు

చోడవరం: ధర్మ ప్రచార వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈ ధర్మ ప్రచార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారోత్సవాలను జిల్లా దేవదాయశాఖ అధికారి రాజారావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త పాత్ర రాజశేఖర్ మాట్లాడుతూ.. ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి సత్యనారాయణమూర్తి, ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ప్రతినిధి వడ్డాది నర్సింహమూర్తి, ఆలయ ట్రస్టుబోర్డు డైరక్టర్లు పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

భూమి పూజ చేసి, పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్



రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెయిన్ రోడ్డును సుమారు రూ.11 కోట్ల వ్యయంతో విస్తరిస్తున్నట్లు తెలిపారు. స్థానికుల అభ్యర్థన మేరకు 100 అడుగుల వెడల్పున రోడ్డును విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. విస్తరణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన భవన యజమానులకు టీడీఆర్ బాండ్లు ఇస్తున్నామన్నారు. కోర్టునాశ్రయించిన 91 మందికి ల్యాండ్ ఎక్విజేషన్ పరిహారం చెల్లించేందుకు పేపరు ప్రకటన జారీ చేసినట్లు తెలిపారు. వీటికీ వీలైనంత వేగంగా పరిహారం చెల్లిస్తామనానరు. నర్సీపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెద బొడ్డేపల్లి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసిందన్నారు. వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. స్వామి అయ్యప్ప దేవాలయాన్ని తొలగిస్తే హిందువుల మనోభావాలను దెబ్బతీసినట్టేనని టీడీపీ నాయకుల ఆరోపణలపై విలేకరుల ప్రశ్నకు బదులిస్తూ వారి హయాంలో విజయవాడలో వందలాది దేవాలయాలను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు.

అయ్యప్ప దేవాలయ తరలింపు ప్రక్రియ ఆలయ కమిటీ చూసుకుంటుందన్నారు. ప్రజావసరాల కోసం చేపడుతున్న రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీసా బేగం, కర్రి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు, డా.రాజశేఖర్, డా.లక్ష్మీకాంత్, కోఆప్షన్ సభ్యులు ఎండీ బాషా, షేక్ రోజా, లగుడు స్వామి, పార్టీ నాయకులు కర్రి రాంగోపాల్, వివిధ దేవాలయాల చైర్మన్లు చెరుకూరి సత్యనారాయణ, ధనిమిరెడ్డి నాగు, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు పూర్తి

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీలో మిగులు సీట్లకు సంబంధించి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినట్లు కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కాలేజీలో 14 ఖాళీలు ఉండగా వీటిలో 9 ఈడబ్ల్యూఎస్ సీట్లు ఉన్నాయి. మిగతావి జనరల్ అండ్ రిజర్వేషన్ కేటగిరీలో మిగిలాయి. ఓపెన్ కేటగిరీలో 2, రిజర్వేషన్ కేటగిరీలో 3సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ లోని ఏయూ రీజియన్‌కు చెందిన 1 సీటు భర్తీ చేశారు. ప్రస్తుతం అభ్యర్థులు లేకపోవడం వల్ల ఎస్వీ యూనివర్సిటీ రీజియన్‌కు చెందిన 8 ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో మిగిలిపోయాయి. వీటిని మార్పు చేయడానికి వీల్లేదని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. స్పాట్‌లో 4,700 కాలేజీ ఫీజు, రూ.700 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి జాయిన్ అయ్యారని, వీరికి తరగతులు ప్రారంభమయ్యాయని తెలియజేశారు. పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి మెటలర్జీ నుంచి ఎలక్ట్రికల్ విభాగంలో స్లైడింగ్‌లో ఇద్దరు విద్యార్థులు చేరారు. సివిల్‌లో 2 ఖాళీలు భర్తీ చేశారు. మెటలర్జీలో ఏర్పడిన నాలుగు ఖాళీలు భర్తీ అయ్యాయి.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ చోరీ


హుండీని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి: మారేపల్లి శారదానది ఒడ్డున పాండవుల మెట్టపై వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీలో నగదుని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దొంగలించుకుపోయారని ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనం జరిగిన ప్రాంతాన్ని క్లూస్ టీమ్‌తో బుధవారం పరిశీలించి వేలి ముద్రలు సేకరించామన్నారు. హుండీ తాళాలు పగలకొట్టి నగదును అపహరించుకుపోయి హుండీని ఆలయం వెనుక భాగంలో విడిచి పెట్టారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగనన్న స్మార్ట్ సిటీ లేఅవుట్ పనులకు భూమి పూజ


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి, భోగాపురం రెవెన్యూ పరిధిలో జగనన్న స్మార్ట్ సిటీ మెగా టౌన్‌షిప్ లేఅవుట్‌కు బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, పీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్‌రావు, లాలం శ్రీను, నర్మాల కుమార్ పాల్గొన్నారు. 70 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్లతో వీఎంఆర్‌డీఏ విభాగం ఆధ్వర్యంలో లే-అవుట్ వేయనున్నారు.

పోలీస్ జట్టు విజయం

విశాఖ స్పోర్ట్స్: వీడీసీఏ ఇనిస్టిట్యూషన్ లీగ్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఏపీఈపీడీసీఎల్ జట్టుపై సిటీ పోలీస్ జట్టు 146 పరుగుల తేడాతో విజయం సాధించింది. వైఎస్ఆర్ బి గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సిటీ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 238 పరుగులు చేసింది. ప్రతిగా ఈపీడీసీఎల్ జట్టు 14 ఓవర్లలోనే 92 పరుగులకే ఆలౌటైంది.

జగనన్నకు చెబుదాంతో సమస్యల సత్వర పరిష్కారం

- మాడుగులలో కార్యక్రమానికి విశేష స్పందన
- మండల వ్యాప్తంగా 27 సమస్యలపై 223 అర్జీల స్వీకరణ
- అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 115 దరఖాస్తులు


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి తదితరులు


జగన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన జిల్లా, మండల స్థాయి అధికారులు

మాడుగుల: మారుమూల ప్రాంతాల్లోని సమస్యల సత్వరమే పరిష్కారమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారుతోంది. మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మాడుగుల పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి పాల్గొని అర్జీదారుల సమస్యలు విన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధితశాఖల అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యులకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం వరంలాంటిదన్నారు. 223 అర్జీలు స్వీకరించగా అందులో రెవెన్యూ సంబంధించినవి 115 కాగా, గృహనిర్మాణశాఖకు సంబంధించి 11, సివిల్‌సప్లయికు సంబంధించి 10, మిగిలిన సమస్యలు 87. అర్జీదారులు కోసం ప్రత్యేకంగా 10 కౌంటర్లు ఏర్పాటు చేసి టోకెన్లు జారీ చేశారు. అన్నిశాఖలకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, గృహనిర్మాణశాఖ పీడీ కె.రమామణి, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్, తహసీల్దార్ పి.వి.రత్నం, డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందజేసిన అర్జీల్లో కొన్ని..

- తాను సాగు చేసుకుంటున్న భూమికి పట్టా ఇవ్వాలని మండలంలో జేడీపేట పంచాయతీ ఎల్.గవరవరం గ్రామానికి చెందిన గిరి రైతు వంతల గోష్పన్న అర్జీ అందజేశారు.
- లోవ వీరనారాయణం వరకు కింతలి ఆర్టీసీ బస్సు సర్వీసును పొడిగించాలని అవురువాడ పంచాయతీ తిరువాడ గ్రామానికి చెందిన ఈటి పోతురాజు దరఖాస్తు అందజేశారు.
- రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండలంలో వొమ్మలి గ్రామానికి చెందిన కొండపల్లి నరసింహమూర్తి కోరారు.
- ఘాట్‌రోడ్ నుంచి కింతలి వరకు రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని జంపెన సర్పంచ్ గురువునాయుడు, వొమ్మలి పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి బొద్దపు భాస్కరరావు, జేడీపేట సర్పంచ్ కాసిరెడ్డి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

భూమి ఇవ్వాలి



మాడుగుల పట్టణం సమీపంలో గత 30 ఏళ్ల క్రితం నిర్మించిన పాల గెడ్డ జలాశయంలో తమ భూములు కలసిపోయాయి. ఆ భూములకు బదులు వేరేచోట భూములు అప్పగిస్తామని అప్పటిలో అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు తనకు భూమి చూపించలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో దరఖాస్తు అందజేశాను. మండలానికి కలెక్టరుతో పాటు జిల్లా అధికారులు వచ్చి దరఖాస్తులు స్వీకరించడం ఆనందంగా ఉంది.

– ఎల్ల అప్పలనాయుడు, రైతు మాడుగుల

మాలాంటి వారికి వరం



కలెక్టరు, జిల్లా అధికారులు మా దగ్గరకు వచ్చి, సమస్యలు తెలుసుకుంటున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం మాలాంటి మధ్యతరగతి వారికి వరంలాంటిది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. గొటివాడ పంచాయతీ శివారు గొళ్లపేటలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఓకే శ్రీరాంపురం నుంచి డి.గొటివాడ రోడ్డువరకు పక్కారోడ్డు నిర్మించాలని దరఖాస్తు అందజేశాను.

–గోకేడ అప్పలనాయుడు, డి.గొటివాడ

మా గ్రామంలో ఆర్టీసీ బస్సులు ఆపాలి



సుమారు మూడు వేల జనాభా ఉన్న ఎం.కోడూరు చుట్టు పక్కల ఐదు గ్రామాలకు కేంద్రం. విశాఖ నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సులను ఇక్కడ నిలపక పోవడంతో రైతులు అధిక చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవలసి వస్తోంది. అందువల్ల ఇక్కడ బస్సులు నిలపాలని, ఈ రోడ్డును విస్తరించాలని కోరుతూ అర్జీ అందజేశాను.

– గొళ్ళవిల్లి రాజేష్ ఎం.కోడూరు

గౌరీపట్నం సర్వేయర్ సస్పెన్షన్

చోడవరం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గౌరీపట్నం సచివాలయ విలేజ్ సర్వేయర్ పి.దివ్యవాణిని సస్పెండ్ చేస్తూ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఎస్.గోపాలరాజు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేయాల్సిన భూముల రీ సర్వే పనుల్లో గౌరీపట్నం విలేజ్ సర్వేయర్ దివ్యవాణి చాలా నిర్లక్ష్యంగా పనిచేశారని స్థానిక రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, జిల్లా అధికారులతో కూడిన బృందం ఈ విషయమై సర్వేయరు, వీఆర్‌ఓలపై విచారణ చేసిన విషయం తెలిసిందే. సర్వేయరు, వీఆర్‌ఓలు భూముల సర్వేలో తప్పులు చేశారని నిర్ధారించిన విచారణ కమిటీ శాఖల వారీగా చర్యలకు దిగింది. ఇప్పటికే వీరికి షోకాజ్ నోటీలు ఇచ్చిన ఆయా శాఖల జిల్లా అధికారులు ఇప్పుడు పూర్తి స్థాయిక్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. సర్వే డిపార్టుమెంట్ నుంచి విలేజ్‌సర్వేయర్ దివ్యవాణిపై తాజాగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కాపీని చోడవరం తహసీల్దార్‌కు పంపారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య


ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందిన లక్ష్మి

రోలుగుంట: మండలం ఎస్.కొత్తూరు పంచాయతీ శివారు మునిపల్లి గ్రామానికి చెందిన కర్రి లక్ష్మి(37) కడుపునొప్పి తాళలేక తన ఇంట్లోనే ఫ్యాన్‌కు బుధవారం వేకువజామున ఉరి వేసుకొని అత్యహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పాచికపల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.నాగకార్తీక్ కేసు నమోదు చేసి గ్రామానికి వెళ్లి విచారించారు. వివరాలిలా ఉన్నాయి. ఏడాదిన్నర కాలంగా గ్రామానికి చెందిన కర్రి లక్ష్మి (37) కడుపు నొప్పి (గైనిక్) సమస్యతో బాధపడుతుంది. నర్సీపట్నం, విశాఖపట్నంలో చికిత్స పొందింది. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజామున నొప్పి ఎక్కువై తట్టుకోలేని ఆమె ఫ్యాన్‌కు చీర వేలాడదీసి ఉరి వేసుకొని అత్యహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎస్‌ఐ గ్రామంలో విచారణ జరిపి, పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త రామారావు, బీటెక్ చదువుతున్న కుమార్తె కీర్తి, టెన్త్ చదువుతున్న కుమార్తె లావణ్య ఉన్నారు. తల్లి మరణంతో ఆ పిల్లల రోధన చూపరులను కలచివేసింది.

ఏయూ రిజిస్ట్రార్‌గా జేమ్స్ స్టీఫెన్


జేమ్స్ స్టీఫెన్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి బుధవారం ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని ఏయూ పాలక మండలి సభ్యులు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులు అభినందించారు. కాగా.. ఆచార్య జేమ్స్ స్టీఫెన్ ప్రస్తుతం ఏయూలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చెర్ నేషనల్ చెర్ ప్రొఫెసర్‌గా, ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ హబ్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు 21 ఏళ్ల సుదీర్ఘ బోధన అనుభవం ఉంది. పదేళ్లుగా పరిపాలన సంబంధిత పదవుల్లో ఉన్నారు. ఏయూ పాలక మండలి సభ్యుడిగా పనిచేశారు. ఆయన కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 32 పేటెంట్‌లు, కాపీరైట్‌లు కలిగి ఉన్నారు. తొమ్మిది జాతీయ, అంతర్జాతీయ గ్రాంట్స్ సాధించారు.

మితాహారమే దివ్య ఔషధం


డాక్టర్ గిరిధర్‌ను దుశ్శాలువాతో సత్కరిస్తున్న గ్రామీణ వైద్యులు

అనకాపల్లిటౌన్: మంచి ఆరోగ్యానికి మితాహారం దివ్య ఔషధమని విశాఖ కేజీహెచ్ గ్యాస్ట్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ఆర్.ఎస్.గిరిధర్ తెలిపారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ సభ్యుల ఆత్మీయ కలయిక బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యాస్ట్రిక్, లివర్, పేగు ఒరుగు తదితర వ్యాధుల గురించి ఆయన వివరించారు. రహదారులపై జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, సమయానికి ఆహారం తినకపోవడంతో శరీరంలో వివిధ రకాలైన అవయవాలు వ్యాధులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మసాల ఉన్న ఆహారం ఎక్కువగా తీసుకున్న వ్యక్తులు ఉదయం, రాత్రి సమయంలో నిత్యం వేడినీటిని తాగడం వల్ల గ్యాస్టిక్‌ను నిర్మూలించవచ్చన్నారు. అనంతరం వైద్యుడు గిరిధర్‌ను సంఘం సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోరుకొండ వీరభద్రరావు, కార్యదర్శి ఈ.ఈశ్వరరావు, జోనల్ ఉపాధ్యక్షుడు అల్లక రాజు, జోన్ మీడియా కో ఆర్డినేటర్ వై.వి.రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు పూర్వ వైభవం జగనన్న చలవే

- చంద్రబాబు అరెస్టుతో ప్రభుత్వానికి సంబంధం లేదు
- ఎమ్మెల్యేబాబూరావు


నక్కపల్లిలో మగ్గం నేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: ప్రభుత్వ ప్రోత్సాహం కరవై చతికిలపడిన చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువచ్చింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డేనని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నక్కపల్లిలో చేనేత కార్మికుల వద్దకు బుధవారం ఆయన వెళ్లి వారి కష్టాలను తెలుసుకున్నారు. నేత కార్మికులతో కలసి కొద్దిసేపు మగ్గం నేసి, నూలు వడికారు. అనంతరం కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి దయవల్ల తమకు ముడిసరుకు కొనుగోలుకు ప్రతి నెలా రూ.2 వేల చొప్పున ఆర్థిసాయం ఇస్తున్నారని, వలస బాటపట్టిన తామంతా తిరిగి కులవృత్తికి చేరువయ్యామని పలువురు నేత కార్మికులు తెలిపారు.ఏడాదికి సరిపడా సాయాన్ని తమ ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడతూ ఇచ్చిన మాట ప్రకారం చేనేతకు సీఎం జగన్‌మోహన్ రెడ్డిపూర్వ వైభవం తీసుకోచ్చారని చెప్పారు. ఏడాదికి రూ.24వేలు ఆర్థిక సాయం చేస్తున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. చంద్రబాబు అరెస్టుతో ప్రభుత్వానికి సంబంధం లేదని చెప్పారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, నేత కార్మిక నాయకులు బంగార్రాజు, కొండ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గొర్రిగెడ్డ చెక్‌డ్యామ్‌ను పరిశీలించిన డిప్యూటీ సీఎం, కలెక్టర్


చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

మాడుగుల రూరల్: మండలంలోని కింతలి, కింతలి వల్లాపురం మధ్యలోగల గొర్రిగెడ్డపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బుధవారం పరిశీలించారు. సుమారు రూ.12 లక్షల వ్యయంతో పూర్తి నాణ్యతాప్రమాణాలతో దీనిని నిర్మిస్తున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం, కలెక్టర్ కింతలి పీహెచ్‌సీని సందర్శించారు. డిప్యూటీ సీఎం చొరవతో ఆస్పత్రిలో పడకలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలోని సమావేశ మందిరాన్ని వారు పరిశీలించారు. సమావేశ మందిరం ఆకర్షణీయంగా ఉందని కలెక్టర్ తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఎం.నాయుడు, సర్పంచ్ రాంబాయి, నాయకులు రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శనను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్

నాతవరం: ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్న సచివాలయాల సందర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. నాతవరంలో బుధవారం పార్టీ శ్రేణులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి అన్న నినాదాన్ని విసృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి వచ్చె నెల 20వరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సందర్శన కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ఒక రాత్రికి బస చేయాలని చెప్పారు. మరుసటి రోజు ఉదయం నుంచి సచివాలయ పరిధిలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి అందించే సంక్షేమంతో పాటు నియోజకవర్గంలో ఇంతవరకు జరిగిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డే మళ్లీ సీఎం కావాలన్నా విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే బాధ్యత పార్టీ క్యాడర్‌పై ఉందన్నారు.

ఇటీవల అనారోగ్యంతో మరణించి ఎం.బి.పట్నం మాజీ సర్పంచ్ వ్రే సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సమావేశంలో 2నిమిషాలు మౌనం పాటించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, మండల పార్టీ అధ్యక్షుడు, లగుడు నాగేశ్వరరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు శిరుసుపల్లి నర్సింగరావు, పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు,నాతవరం సర్పంచ్ గోలగాని రాణీ, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పీకే గూడెం పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి అచ్చెర్ల వరహలబాబు, మంకు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో ముగ్గురి అరెస్టు

అనకాపల్లి టౌన్: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు గ్రామీణ ఎస్‌ఐ సీహెచ్.నర్సింగరావు బుధవారం చెప్పారు. ఎస్‌ఐ అందించిన వివరా లిలా ఉన్నాయి. మండలంలో ఊడేరు కూడలి వద్ద 22 కేజీల గంజాయి కేసులో పరారీలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం బందవీధి కొత్తూరు గ్రామానికి చెందిన కిల్లో దేవదాస్, అదే గ్రామానికి చెందిన కిల్లో బోంజిబాబు, కిల్లో భాస్కరరావులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

వలంటీర్ ఉదారత


తన గౌరవ వేతనం నుంచి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీ ప్రసన్న


సూర్యకాంతానికి పింఛన్ అందజేస్తున్న అరబుపాలెం వలంటీర్ సునీత


కేజీహెచ్‌లో కొండబాబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివాజీ


పెనగంటి అచ్చిబాబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జగదీ

మునగపాక: జిల్లాలో వలంటీర్లు మెరుగైన సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని ఉమ్మలాడకు చెందిన వలంటీర్ సూరిశెట్టి లక్ష్మీ ప్రసన్న తన గౌరవ వేతనంలో ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున పింఛన్ అందజేశారు. సాంకేతిక కారణాలతో పింఛన్‌కు నోచుకోని తన పరిధిలో ఉన్న ఇద్దరికి పింఛన్ అందజేసి ఉదారత చాటుకుంటున్నారు. నాలుగు నెలలుగా ఇద్దరికి నెలకు రూ.2వేల చొప్పున రూ.8వేలను అందజేస్తున్నారు.

గాజువాక వెళ్లి..

అరబుపాలెం గ్రామానికి చెందిన యల్లపు సూర్యకాంతం ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకున్నారు.ఆపరేషన్ తరువాత గాజువాకలో ఉంటున్న తన కొడుకు ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.దీంతో వలంటీర్ దొడ్డి సునీత బుధవారం గాజువాక వెళ్లి సూర్యకాంతానికి అక్టోబర్ నెల పింఛన్ సొమ్ము అందజేశారు.

కేజీహెచ్‌లో..

రోలుగుంట: మండలకేంద్రం రోలుగుంటకు చెందిన చెవ్వేటి కొండబాబు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ తమరాన శివాజీ బుధవారం కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు.

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లికి చెందిన పెనగంటి అచ్చిబాబు అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వలంటీర్ ఆర్.జగదీ బుధవారం కేజీహెచ్‌కు చేరుకుని పింఛన్ నగదు అందజేశారు. రెండు వైపులా సుమారు 100 కిలోమీటర్ల మేర ప్రయాణించి పింఛన్ సొమ్ము అందజేసిన వలంటీర్ జగదీని స్థానిక అధికార్లు, ప్రజాప్రతినిధులుఅభినందించారు.

65 కిలోమీటర్లు ప్రయాణించి..

కోటవురట్ల: ప్రతిపక్షాలు కుట్రపూరితంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నా వాటికి వెరవక వలంటీర్లు తమ సేవా దృక్పథాన్ని కొనసాగిస్తున్నారు. తమ పరిధిలోని లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు అండగా ఉంటున్నారు. జల్లూరుకు చెందిన చిటికెల శ్రీరాములు కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురై అచ్యుతాపురం మండలంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో వలంటీర్ లెక్కల వెంకటలక్ష్మి బుధవారం అచ్యుతాపురం వెళ్లిని ఆయనకు పింఛను నగదు అందజేశారు. సుమారు 65 కిలోమీటర్లు ప్రయాణించి పింఛను నగదును అందించడంతో పలువురు ఆమెను ప్రశంసించారు.


అచ్యుతాపురంలో పింఛను నగదును అందజేస్తున్న వలంటీరు వెంకటలక్ష్మి

క్లుప్తంగా

దుర్గా నవరాత్రి ఉత్సవాలకు రాట మహోత్సవం



రాట మహోత్సవంలో దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: గవరపాలెం వెంకటరెడ్డినాయుడుగారి వీధిలో శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే దసరా నవరాత్రుల మహోత్సవంలో భాగంగా దుర్గామాత అమ్మవారి రాటమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి శరన్నవరాత్రుల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు, పీలా రాముడు, నగేష్, జగన్, గణేష్, సత్యనారాయణ, కొణతాల పూర్ణచంద్రరావు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

7న వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

అనకాపల్లిటౌన్: మండలంలోని మార్టూరు గ్రామంలో ఈ నెల 7న వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా ప్రాదేశిక సభ్యులు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సర్పంచ్‌లు, మండల ప్రాదేశిక సభ్యులు, పార్టీ పెద్దలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కామాక్షమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కోటిపల్లి

అనకాపల్లిటౌన్: గవరపాలెం పార్కుసెంటర్ శ్రీ కామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో ఈ ఏడాది దసరా ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కోటిపల్లి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమ్మవారి ఆలయ ఆవరణలో బుధవారం జరిగిన ఎన్నికల్లో వైస్ చైర్మన్‌గా శొంఠ్యాణ సతీష్, కోశాధికారిగా తణుకు రవికుమార్, కన్వీనర్లుగా పండూరి సత్యనారాయణ, ధవశేశ్వరపు లక్ష్మణ్, నెల్లిపూడి నాగేశ్వరరావుతో పాటు మరో 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోటిపల్లి శ్రీను మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దల సహాయ సహకారాలతో దసరా నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

పెదకాపు	: రాజా
స్కంద	: సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి	: సత్యనారాయణస్క్రీన్-2
జవాన్ (మార్నింగ్, మ్యాట్నీ)	
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: షిర్డిసాయి
స్కంద	: పర్తిసాయి
ఖుషి	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
చంద్రముఖి 2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 564 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,280	4,320
రెండో రకం	4,070	4,280
మూడోరకం	3,800	4,060

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 359 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలకు శ్రీరామ రక్ష

- గ్రామీణ ప్రాంతాలకూ చేరువైన ఉన్నత వైద్య సేవలు
- ఉగ్గినపాలెం, పిసినికాడ శిబిరాలకు భారీ స్పందన

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం సచివాలయ పరిధి ప్రజలకు ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 381 మంది వివిధ పరీక్షలు చేయించుకుని, వైద్య సేవలు పొందారు. ఉగ్గినపాలెంతోపాటు సచివాలయ పరిధిలోని పరవాడపాలెం గ్రామం నుంచి కూడా వ్యాధిగ్రస్తులు, ప్రజలు శిబిరానికి హాజరయ్యారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యుడు యు.రమేష్, తగరంపూడి వైద్యురాలు పావని, అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జనరల్ సర్జన్ రవితేజ, ఆప్తాలమిక్ వైద్యుడు ఆనందరావు హాజరై వైద్య సేవలందించారు. బీపీ, సుగర్, రక్తహీనత, డెంగ్యూ, మలేరియా, మూత్రం కఫం తదితర పరీక్షలు నిర్వహించారు. కళ్ల పరీక్షలు నిర్వహించి 56 మందికి కళ్లద్దాలు, కొందరిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగేలా ప్రదర్శన ఏర్పాటు చేశారు.

డీఎంహెచ్‌వో పరిశీలన

ఈ ప్రదర్శనను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.హేమంత్ తిలకించారు. ఆరోగ్య విషయాల పట్ల ప్రజలకు సమగ్రంగా అవగాహన కలిగించాలన్నారు. శిబిరంలో టీవీ ఏర్పాటు చేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, ఆరోగ్య సూచనల గురించి వీడియోలను ప్రదర్శించాల్సిందిగా సూచించారు. రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, శిబిరాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.



ఉగ్గినపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఓపీ తీసుకుంటున్న ప్రజలు

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం: బొడ్డేడ

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ శిబిరానికి హాజరై, ఏర్పాట్లను, వైద్య సేవల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు గతంలో ఎన్నడూ లేనంతగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవల్ని ప్రజలకు చేరువ చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఉన్నత వైద్యానికి పట్టణ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నామన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజలు, పార్టీ శ్రేణుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు.

శిబిరాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించేలా ప్రదర్శన ఏర్పాటు చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు జి.రమణకుమార్, జగదీష్, రోజారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

అనకాపల్లి రూరల్: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అనకాపల్లి మండలంలో పండగలా సాగుతోంది. మండలంలోని తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటికే ఖరారు చేసిన షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30 నుంచి ప్రారంభమైన శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. బుధవారం మండలంలోని పిసినికాడ సచివాలయ భవనం వద్ద నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేస్తున్న తీరు, మందుల లభ్యతను ఆరా తీశారు. వైద్యులు శ్రీధరి, వాణీ జగదీశ్వరి, తిరుపతిరావు, ఏసుప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, సీహెచ్‌వోలు వైద్య సేవలందించారు. మొత్తం 383 ఓపీ కేసులు రాగా కంటి వైద్యనిపుణులు 95 మందిని, గైనకాలజిస్టు 11 మందిని పరీక్షించారు. 77 మందికి బీపీ,74 మందికి సుగర్ టెస్టులు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి ఏ హేమంత్, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి, ఆర్డీవో చిన్నికృష్ణ, ఎంపీడీవో కెవి నరసింహారావు, తహసీల్దార్ గంగాధరరావు, పిసినికాడ సర్పంచ్ యల్లపు రమేష్, ఎంపీటీసీ మొల్లేటి హైమ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మొల్లేటి శివాజీ, దాడి రాము, దాడి రామ్ త్రినాథ్, వెలగ కోటి, దాడి ప్రసాద్, బొడ్డేడ లక్ష్మి, మళ్ల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



ఉగ్గినపాలెం ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హేమంత్



సేవలందిస్తున్న వైద్యురాలు పావని



శిబిరంలో ఉచిత మందుల పంపిణీ



పిసినికాడలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



పౌష్టికాహార ప్రాధాన్యంపై ప్రదర్శన



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి రమణకుమార్



పాపతో శిబిరానికి హాజరైన మహిళ



సురక్ష వైద్య శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హేమంత్



అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకిస్తున్న నాయకులు, స్థానికులు

వైఎస్సార్‌సీపీ విజయానికి గ్రామ స్థాయిలో కృషి

అనకాపల్లి టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం గ్రామీణ స్థాయి నుంచి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నూతనంగా నియమితులైన పార్టీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు అన్నారు. బుధవారం పార్టీ నేతలు ఆయన్ని అభినందిస్తూ, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ఇంటింటి ప్రచారం చేపట్టాలన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి పైసా అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాకే లబ్ధి చేకూరుతోందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత సంక్షేమం అందాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆయన్ని సత్కరించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, నూకాంబిక దేవస్థానం డైరెక్టర్ బుద్ద నరసింహరాజు, భోగలింగేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ వాసుపల్లి తాతయ్యలు, పార్టీ నాయకులు ఏడువాకల నారాయణరావు, సత్యనారాయణ తదితరులున్నారు.



లక్ష్మీనరసింహరావును శాలువాతో సత్కరిస్తున్న శివ

బియ్యం కార్డులపై గోధుమ పిండి సరఫరా



కశింకోట: మండలంలో బియ్యం కార్డులపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల కోటాలో చెక్కి గోదుమ పిండి సరఫరా చేపట్టారు. ఇప్పటి వరకు కార్డుదారులకు బియ్యం ఒక్కొక్కరికి 5 కిలోల వంతున ఉచితంగాను, పంచదార రాయితీపై అరకిలో రూ.17కు అందిస్తున్నారు. ఈ నెల నుంచి అదనంగా విటమిన్‌లతో కూడిన గోధుమ పిండి కిలో ప్యాకెట్‌ను రాయితీపై రూ.16కు సరఫరా చేస్తున్నారు. తక్కువ ధరకే గోధుమ పిండి అందించడం పట్ల కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న ఎంపీ దంపతులు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఉత్సవాలను నిర్వహించాలని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక శారదానది ఒడ్డునున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఎంపీ సత్యవతి దంపతులు బుధవారం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దశలవారీగా అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జెట్టి సూరిబాబు, కమిటీ సభ్యులు పలకా చంటి, నమ్మిన రమణాజీ, పలకా కాసులు, నాని, వెంకటేష్, బోయిన అప్పారావు, గైపూర్ రాజు, అప్పికొండ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ దంపతులకు పోలేరమ్మ ప్రసాదాన్ని అందిస్తున్న ఆలయ అర్చకుడు

శరవేగంగా వెల్‌నెస్ కేంద్రం నిర్మాణం

అనకాపల్లి రూరల్: తుమ్మపాలలోని గవరపేట వీధి కొణతాలవారి దిబ్బ వద్ద నిర్మిస్తున్న వెల్‌నెస్ కేంద్రం శ్లాబు పనులను ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.17.50 లక్షల వ్యయంతో చేపడుతున్న భవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పనులు పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. సీఎం జగన్ ఆలోచనలతో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం భవనాలను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పంచాయతీ రాజ్ ఏఈ కుమార్‌రాజు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, దంతులూరి కల్యాణ్ బాబు, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వడ్డాది భారతి, వడ్డాది అశోక్, ఉప సర్పంచ్ చదరం చిన్న, పంచాయతీ వార్డు సభ్యులు వెలగ మోదినాయుడు, కొణతాల చంటమ్మ, తర్ర సత్యారావు, కొయ్య జగదలక్ష్మి, భాస్కర్, అంగులూరి సత్యనారాయణ, శ్రీ లక్ష్మి, రైతు సంఘం అధ్యక్షుడు పీలా బుజ్జి, ఆర్టీసీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



గవరపేట వీధిలో వెల్‌నెస్ కేంద్రం పనులు పరిశీలిస్తున్న దిలీప్ కుమార్

రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి స్థల పరిశీలన

అనకాపల్లిటౌన్: రైల్వే అండర్ పాస్ నిర్మాణం కోసం మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో బుధవారం ఎంపీ బీవీ సత్యవతి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే ఇంజినీర్లు కేటాయించిన స్థలాన్ని పరిశీలించామన్నారు. ఈ నిర్మాణం జరిగితే జిల్లావాసులకు రహదారి ఇక్కట్లు తీరతాయన్నారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఈ నిర్మాణానికి అవసరమయ్యే నిధులు మంజూరుకు సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు కె.విష్ణుమూర్తి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

నేడు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

అనకాపల్లిటౌన్: స్థానిక పెరుగుబజార్-గాంధీ బొమ్మ జంక్షన్ వరకూ రూ.3 కోట్ల 6 లక్షల నిధులతో రహదారి విస్తరణ, డ్రైనేజీ నిర్మాణపనులకు గురువారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుబజార్-గాంధీబొమ్మ జంక్షన్ రహదారి విస్తరణలో గృహాలు, స్థలాలు కోల్పోయిన యజమానులకు ప్రభుత్వంచే టీడీఆర్ పత్రాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా రహదారికి ఇరువైపులా డ్రైనేజీ పనులు పూర్తి చేసి, అనంతరం ఫుట్‌పాత్, నూతన రహదారి నిర్మాణ పనులు చేపడతామన్నారు. 84వ వార్డు పరిధిలో కోట్నివీధిలో రూ.14.80 లక్షల నిధులతో ఓపెన్ జిమ్ నిర్మాణపనులకు శంకుస్థాపన జరగనుందన్నారు. కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనకాపల్లిటౌన్: మండలంలోని మార్టూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టూరు సచివాలయ పరిధిలో ఇప్పటికే జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే జరిగిందన్నారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సురక్ష శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

బయ్యవరంలో..

కశింకోట: మండలంలోని బయ్యవరం హైస్కూల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ గొల్లవిల్లి జయ బుధవారం తెలిపారు. శిబిరానికి ప్రత్యేక వైద్య నిపుణులు, పీహెచ్‌సీ వైద్యులు హాజరై రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బయ్యవరం సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

దత్త క్షేత్రంలో శరన్నవరాత్రులకు ప్రత్యేక ఏర్పాట్లు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి శ్రీ చింతామణి గణపతి దత్త క్షేత్రంలో శరన్నవరాత్రి మహోత్సవాలను ఈ నెల 15 నుంచి 24 వరకూ నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దత్త క్షేత్ర నిర్వాహకుడు అంజనేయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న నవదుర్గ కలశ స్థాపన, పసుపు కొమ్ములతో అర్చన, లక్ష్మీగణపతి హోమం, 16న నిమ్మకాయలతో అర్చన, 17న గాజులతో అర్చన, 18న రవికల వస్త్రాలతో అర్చన, 19న ధనార్చన, మహామృత్యుంజయ హోమం, 20న సరస్వతీ పూజలో భాగంగా పుస్తకాలతో అర్చన, సామూహిక అక్షరాభ్యాసాలు, 21న వివిధ ఫలములతో అర్చన, 22న లక్ష్మీ గవ్వలతో అర్చన, చండీ హోమం, 23న మారేడు దళములు, గులాబీలతో అర్చన, 24న శమీ పూజ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శరన్నవరాత్రుల్లో రోజూ సుమేరుకి అభిషేకం, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణ ఉంటుందన్నారు.

రీ సర్వేతో భూములకు రక్షణ

కశింకోట: గతంలో ఎన్నడూ లేని విధంగా వందేళ్ల తర్వాత భూముల రీ సర్వే జరిపించి రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. మండలంలోని ఏనుగుతుని గ్రామంలో సుమారు 400 మంది రైతులకు రీ సర్వే అనంతరం మంజూరైన జగనన్న భూహక్కు పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్రాల్లో తప్పులు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సవరించుకోవాలన్నారు. తహసీల్దార్ జి.సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.



ఏనుగుతునిలో భూహక్కు పత్రాల అందజేత

శభాష్ వలంటీర్


కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన వలంటీర్ సేవా భావం చాటుకున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారుకు బుధవారం విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి నగదు అందించారు. బయ్యవరానికి చెందిన తిర్రి రాజ్యలక్ష్మికి వింతంతు పింఛన్ వస్తోంది. ఆమె అనారోగ్యంతో విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో ఆర్ఈసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ సూచన మేరకు వలంటీర్ సుంకర పావని సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి పింఛన్ నగదు అందించి, స్థానికుల అభినందనలు పొందారు.



రాజ్యలక్ష్మికి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ పావని

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

అనకాపల్లి రూరల్: సరైన సమయంలో తగు విధంగా సస్యరక్షణ చర్యలు చేపడితే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామారావు సూచించారు. బుధవారం మండలంలోని తుమ్మపాల సమీపంలో సాగులో ఉన్న వరి పొలాలను పరిశీలించి, రైతులకు తగు సూచనలిచ్చారు. పంటను ఆశించే తెగుళ్లను ముందుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వలన ప్రస్తుతం తుమ్మపాల ప్రాంతంలో వరి పొలాలు ఆకుపచ్చగా కళకళలాడుతున్నాయని, ఆకుముడత, అగ్గితెగుళ్లు అక్కడక్కడ ఆశించాయన్నారు. వీటి నివారణ చర్యలను వివరించారు. ప్రతి రైతు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఈ క్రాప్ నమోదు తర్వాత ఈకేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, రైతు నాయకులు పీలా బుజ్జి, వేగి వెంకట కన్న అప్పారావు, రైతులు పాల్గొన్నారు.



తుమ్మపాల సమీపంలో వరి పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ రామారావు